భారత్-చైనా సంబంధాలు.. ప్రణబ్ పర్యటన!

ప్రపంచంలో అత్యధిక జనాభా గల భారత్-చైనాల మధ్య సంబంధాలు మొదటి నుంచి ఒడిదుడుకులను ఎదుర్కొంటూనే ఉన్నాయి. భారతదేశ ఈశాన్య రాష్ట్రాలైన సిక్కిం, అరుణాచల్ ప్రదేశ్‌లలోని కొన్ని ప్రాంతాలు తనవంటూ.. ఇటీవల చైనా చేసిన ప్రకటనతో భారత్-చైనా సంబంధాలు మరోమారు వార్తల్లోకెక్కాయి. ఈ నేపథ్యంలో ఇరుదేశాల మధ్య సంబంధాలను మెరుగుపరిచే దిశగా.. భారత విదేశాంగ మంత్రి ప్రణబ్ ముఖర్జీ నాలుగు రోజుల చైనా పర్యటన ప్రాధాన్యాన్ని సంతరించుకుంది!!

విదేశాంగ మంత్రి ప్రణబ్ ముఖర్జీ తన పర్యటనలో భాగంగా.. చైనా విదేశాంగ మంత్రి యంగ్ జీ చీతో ఇరుదేశాల మధ్య సంబంధాలను మెరుగుపరిచే విషయంపై చర్చలు జరిపారు. చర్చల సారాంశంపై భారత విదేశాంగ కార్యదర్శి శివశంకర్ మీనన్ మాట్లాడుతూ.. రెండుదేశాల ద్వైపాక్షిక సంబంధాలను ప్రభావితంచేసే అన్ని అంశాలపై.. సకారాత్మక, నిర్మాణాత్మకమైన ముందుచూపుతో చర్చలు జరిగాయన్నారు. వివాదాస్పద సరిహద్దు విషయంపై... ప్రస్తుతం అమలులో ఉన్న సామరస్య విధానాల ద్వారా సరిహద్దు వెంబడి శాంతిని కొనసాగించాలని నిర్ణయించారు. సిక్కిం అంశంపై ఇరుదేశాల అభిప్రాయాలు భిన్నంగా ఉండటంతో... ఈ విషయాన్ని పరస్పర ద్వైపాక్షిక చర్చల ద్వారా పరిష్కరించుకోవాలని అంగీకరించారు.

చర్చల పురోగతిపై సంతృప్తి:

సరిహద్దు విషయంపై ప్రతినిధుల స్థాయి చర్చల ద్వారా ఇరువర్గాలకు ఆమోదయోగ్యమైన నిర్ణయానికి రావాలని తీర్మానిస్తూ ... ఇప్పటివరకూ జరిగిన చర్చలలో పురోగతి పట్ల సంతృప్తిని వ్యక్తం చేసారు. ఇదే సమయంలో సరిహద్దు వెంబడి యథాతథస్థితిని కొనసాగించాలని.. సరిహద్దు వెంబడి నెలకొన్న శాంతికి భంగం కలిగించే చర్యలు గాని, ప్రకటనలు గాని చేయరాదని నిర్ణయించారు. 43 ఏళ్ల తర్వాత లఢక్ ప్రాంతంలో ఇటీవల భారత్ పునఃప్రారంభించిన దౌలత్ బేగ్ ఓల్డీ విమాన స్థావరం విషయంపై ఎలాంటి చర్చలూ జరగలేదు. ఈ విమాన స్థావరం అక్సాయ్ చిన్ (పాకిస్తాన్ ఆక్రమించి, తర్వాత చైనాకు ఇచ్చిన జమ్మూ కాశ్మీర్‌లోని ప్రాంతం) ప్రాంతానికి అతి దగ్గరలో ఉంది. ఇది వ్యూహాత్మకంగా భారత్‌కు అత్యంత కీలకమైందనేది నిపుణుల అభిప్రాయం. చర్చల సందర్భంగా రానున్న వర్షాకాలంలో బ్రహ్మపుత్రా నది నీటి మట్టానికి సంబంధించిన వివరాలను ముందుగానే భారత్‌కు అందజేసేందుకు చైనా అంగీకరించింది. ఈ సమాచారం సాయంతో బ్రహ్మపుత్రానది కారణంగా భారత్‌లో వచ్చే వరదలను ఎదుర్కోవడానికి ముందస్తు చర్యలను చేపట్టడం సులభమవుతుంది. టిబెట్‌లో ప్రారంభమయ్యే బ్రహ్మపుత్రా నదిని చైనాలో యార్లూంగ్ జాంగ్‌బో అంటారు! 2010 నాటికి 40 బిలియన్ల డాలర్ల వ్యాపార లావాదేవీలను సాధించాలన్నది ఇరు దేశాల లక్ష్యం. ఈ లక్ష్యాన్ని 2010 కంటే ముందుగానే సాధించగలమని రెండు దేశాలు ఆశాభావం వ్యక్తం చేశాయి. చైనాలో మే నెలలో సంభవించిన భూకంపం

తర్వాత, అక్కడ పునర్నిర్మాణ కార్యక్రమాల్లో తన వంతు సాయం చేసేందుకు భారత్ సంసిద్ధత వ్యక్తం చేసింది. ప్రణబ్ ముఖర్జీ తన చైనా పర్యటన సందర్భంగా.. దక్షిణ చైనా ప్రాంతంలోని గువాంగ్ ఝో నగరంలో భారత కాన్సులేట్ కార్యాలయాన్ని ప్రారంభించారు. పేకింగ్ యూనివర్సిటీని సందర్శించి.. చైనా ఇండాలజిస్టు జి జియాన్‌లిన్‌కు భారతప్రభుత్వం తరపున పద్మభూషణ్ అవార్డును అందజేశారు. ఓ చైనా పౌరుడికి భారత ప్రభుత్వం ఈ విధంగా పురస్కారాన్ని అందజేయడం ఇదే మొదటిసారి. జి జియాన్‌లిన్ భారతీయుల ఆరాధ్య గ్రంథమైన రామాయణాన్ని చైనా భాషలోనికి అనువదించారు.

ప్రధాన సమస్యలు.. నేపథ్యం:

1. సరిహద్దు సమస్య, 2. టిబెట్, 3. పాకిస్తాన్‌కు చైనా అణు సహకారం.

సరిహద్దు వివాదం:

భారత్ చైనాల మధ్య సరిహద్దు సమస్య ఈనాటిది కాదు. బ్రిటిషర్లు భారత్‌ను వదిలి వెళ్లినపుడు చైనాతో సరిహద్దును స్పష్టంగా నిర్ధారించలేదు. దాని ఫలితమే సరిహద్దు విషయంలో అనిశ్చితి. మెక్‌మోహన్ రేఖను భారత్, చైనాల మధ్య విభజన రేఖగా గుర్తించారు. 1914లో బ్రిటన్ ప్రభుత్వానికి, టిబెట్‌కు మధ్య సిమ్లాలో ఒప్పందం జరిగింది. అప్పట్లో బ్రిటిష్ ఇండియా విదేశాంగ కార్యదర్శి హెన్రీ మెక్ మోహన్. అందుకే ఆ రేఖకు మెక్‌మోహన్ రేఖగా పేరు వచ్చింది. మెక్‌మోహన్ రేఖను భారత్ న్యాయపరమైన జాతీయ సరిహద్దుగా భావిస్తుంది. చైనా మాత్రం సిమ్లా ఒప్పందాన్ని, మెక్‌మోహన్ రేఖను గుర్తించడానికి అంగీకరించడంలేదు. అప్పటి సిమ్లా ఒప్పందంపై బ్రిటిష్ ప్రభుత్వం, దలైలామా ప్రతినిధి సంతకం చేసారు. ఈ మెక్‌మోహన్ రేఖకు ఒక వైపున చైనా (అప్పటి టిబెట్), మరోవైపు భారత్ (అప్పటి బ్రిటిష్ ఇండియా) ఉన్నాయి. ఒప్పందం జరిగినపుడు ఉన్న టిబెట్ ప్రభుత్వం.. అధికారం లేకుండా ఈ ఒప్పందాన్ని కుదుర్చుకుందని, టిబెట్ స్వాతంత్ర్యాన్ని గుర్తించనపుడు, ఆ ప్రభుత్వం 1914లో కుదుర్చుకున్న ఒప్పందాన్ని గుర్తించేది లేదని.. అందువల్ల మెక్‌మోహన్ రేఖను న్యాయపరమైన సరిహద్దుగా గుర్తించే ప్రశ్నేలేదని చైనా వాదిస్తుంది. పశ్చిమాన భూటాన్ నుంచి తూర్పున బ్రహ్మపుత్రా నది వరకు 550 మైళ్ల పొడవున ఈ మెక్‌మోహన్ రేఖ ఉంది. చైనా మ్యాప్ ప్రకారం.. మెక్‌మోహన్ రేఖకు దక్షిణంగా 56 వేల చదరపు మైళ్ల విస్తీర్ణం తనదేనని (దీన్ని చైనా, దక్షిణ టిబెట్ అంటుంది) వాదిస్తుంది. అయితే, ఇది భారత్‌లో అంతర్భాగం. ఇదే ఈశాన్య రాష్ట్రమైన అరుణాచల్ ప్రదేశ్. 1937లో సర్వే ఆఫ్ ఇండియా ద్వారా ప్రచురించిన మ్యాప్‌లో మెక్‌మోహన్ రేఖను బ్రిటిష్ ప్రభుత్వం అధికారిక సరిహద్దుగా గుర్తించింది. 1938లో సిమ్లా ఒప్పందాన్ని కూడా ద్వైపాక్షిక ఒప్పందంగా ప్రకటించింది. అలా చట్టబద్ధతను సంతరించుకున్న మెక్‌మోహన్ రేఖను.. భారత్ గుర్తిస్తున్నా.. చైనా గుర్తించడం లేదు.

పంచశీల సిద్ధాంతం:

భారత్ 1947లో స్వతంత్ర్యాన్ని సాధిస్తే.. మావోజిడాంగ్ తీసుకొచ్చిన విప్లవం ద్వారా 1949లో పీపుల్స్ రిపబ్లిక్ ఆఫ్ చైనా ఏర్పడింది. అప్పటి నుంచి భారత్ చైనా సంబంధాలు వృద్ధి చెందుతూ వచ్చాయి. భారత ప్రధాని జవహర్ లాల్ నెహ్రూ, చైనా ప్రధాని చౌఎన్‌లాయ్‌ల మధ్య 1954లో పంచశీల సిద్ధాంతం ఆధారంగా సంబంధాలు మెరుగుపడ్డాయి.

1. ఇరుదేశాలు పరస్పరం సార్వభౌమత్వాన్ని గౌరవించుకోవడం
2.పరస్పరం ఒకరిపై మరొకరు దురాక్రమణకు పాల్పడ కుండటం
3. ఒకరి అంతర్గత వ్యవహారాల్లో మరొకరు తలదూర్చకుండడం
4. సమానత్వం, పరస్పర సహకారం
5. శాంతియుత సహజీవనం

టిబెట్ సమస్య:

1954లో భారత్, టిబెట్‌ను చైనాలో భాగంగా గుర్తించింది. 1959లో టిబెట్‌ను చైనా ఆక్రమించడంతో... దలైలామా నేతృత్వంలో టిబెట్ ప్రజలు భారత్‌కు వలస రావడం ప్రారంభించారు. వేలమంది టిబెటన్ శరణార్థులు హిమాచల్ ప్రదేశ్‌లోని ధర్మశాలలో ప్రవాస ప్రభుత్వాన్ని ఏర్పరచుకున్నారు. చైనా దీన్ని వ్యతిరేకిస్తూ.. భారత్ మ్యాప్‌లలో పేర్కొన్న నార్త్-ఈస్ట్ ఫ్రంటియర్ ఏజెన్సీ (NEFA) (ఇప్పటి అరుణాచల్ ప్రదేశ్)ని తన భూభాగంగా పేర్కొంటూ ప్రకటనలు చేసింది. 1962లో మావోజిడాంగ్ నేతృత్వంలో ప్రారంభించిన గ్రేట్ లీప్ ఫార్వడ్ (Great Leap Forward) విఫలమవడంతో ... ప్రజాదరణ పెంచుకోవడానికి.. ప్రజల దృష్టిని మరల్చడానికి.. సరిహద్దు వివాదాన్ని కారణంగా చూపి, భారతదేశంపై దురాక్రమణ జరిపారు. ఈ దురాక్రమణతో భారత్ చైనా సంబంధాలు బాగా దెబ్బతిన్నాయి. 1972లో NFEAను అరుణాచల్‌ప్రదేశ్‌గా పేరు మార్చారు. 1987లో అరుణాచల్ ప్రదేశ్‌ను పూర్తిస్థాయి రాష్ట్రంగా భారత్ ప్రకటించింది.

1988లో రాజీవ్ చైనా పర్యటన:

1988లో అప్పటి భారత ప్రధాని రాజీవ్ గాంధీ చైనా పర్యటనతో.. మళ్లీ భారత్, చైనా మధ్య సంబంధాలలో పురోగతి మొదలైంది. ఇరుదేశాలు పంచశీల సిద్ధాంతం ఆధారంగా ద్వైపాక్షిక సంబంధాలను మెరుగుపరచుకోవడానికి.. ఇరుదేశాలకు ఆమోదయోగ్యమైన రీతిలో ద్వైపాక్షిక చర్చల ద్వారా సమస్యలను పరిష్కరించుకోవడానికి అంగీకరించారు. ఇరుదేశాలు సరిహద్దు సమస్యపై ఒక సంయుక్త కార్యాచరణ సంఘాన్ని ఏర్పాటు చేశాయి. రాజీవ్‌గాంధీ పర్యటన సందర్భంగా.. శాస్త్ర సాంకేతిక రంగాలు, విమానయాన రంగాల్లో పరస్పరం సహకారాన్ని పెంపొందించుకునేందుకు రెండు దేశాలు అంగీకరించాయి. ఆర్థిక వ్యాపార లావాదేవీలలో పరస్పర సహకారాన్ని పెంపొందించుకోవడానికి కూడా

అంగీకరించాయి. 28 ఏళ్ల తర్వాత శిఖరాగ్ర స్థాయిలో జరిగిన ఈ చర్చలతో భారత్, చైనా సంబంధాలు మళ్లీ గాడిన పడ్డాయి. 1991లో అప్పటి చైనా ప్రధాని (Lipeng) లీపెంగ్ భారత్‌లో పర్యటించడం.. ఆ తర్వాత 1993లో భారత ప్రధాని పి.వి. నరసింహారావు చైనా పర్యటించడంతో ద్వైపాక్షిక సంబంధాలు బలపడ్డాయి. 1996లో అప్పటి చైనా అధ్యక్షుడు జియాంగ్ జెమిన్ (భారత్‌ను సందర్శించిన మొట్టమొదటి చైనా అధ్యక్షుడు) భారత్ పర్యటన సందర్భంగా.. ఇరుదేశాలు పరస్పరం విశ్వాసాన్ని పెంపొందించే చర్యలు తీసుకోవాలనే ఒప్పందంపై సంతకం చేసాయి. 2006లో చైనా అధ్యక్షుడు హూ జింటావో భారత పర్యటన సందర్భంగా.. 2006ని ఇండియా–చైనా ఫ్రెండ్‌షిప్ ఇయర్‌గా ప్రకటించారు. ఆర్థిక సంబంధాలపై పురోగతిని సాధిస్తూ.. సరిహద్దు సమస్యను శాంతియుతంగా పరిష్కరించుకోవాలని ఈ పర్యటన సందర్భంగా పునరుద్ఘాటించారు. ఆర్థిక సంబంధాలను పెంపొందించేదిశగా 2006లో టిబెట్ సిక్కింలను కలిపే (Nathula pass) నాథులా పాస్‌ను వ్యాపార వృద్ధి కోసం 44 ఏళ్ల తర్వాత మళ్లీ తిరిగి ప్రారంభించారు.

పాక్‌కు అణు సహకారం:

పాకిస్తాన్ జమ్మూకాశ్మీర్‌లో కొంత భాగాన్ని ఆక్రమించి.. అక్సాయ్ చిన్ అనే ప్రాంతాన్ని చైనాకి ఇవ్వడంతో ... భారత్–పాక్‌ల మధ్య సంబంధాలు బెడిసికొట్టినప్పుడల్లా పాక్‌కు చైనా వెన్నుదన్నుగా నిలుస్తూ వచ్చింది. భారతదేశం స్వశక్తితో అణ్వస్త్ర దేశంగా ఎదిగితే.. పాక్‌అణ్వస్త్ర దేశంగా మారడానికి చైనా ఇతోధిక సహకారం చేసింది. పాక్‌ను అణ్వస్త్ర దేశంగా చేయడం ద్వారా భారత్‌ను సమర్థవంతంగా నిలువరించ వచ్చనేది చైనా వ్యూహమని నిపుణుల అభిప్రాయం. సరిహద్దు సమస్య విషయంలో.. సంయుక్త కార్యాచరణ బృందం (Joint working group) స్థాయిలో శాంతియుత చర్చల ద్వారా.. టిబెట్ విషయంలో టిబెటన్ల న్యాయపరమైన హక్కులను గౌరవించడం, వారి సంస్కృతిని పరిరక్షించడం ద్వారా.. జమ్మూ కాశ్మీర్ విషయంలో భారత్–పాకిస్తాన్ పరస్పరం శాంతియుత చర్చల ద్వారా పరిష్కరించుకునేందుకు తగిన వాతావరణం కల్పించడం ద్వారా... ఇరుదేశాల మధ్య ఆర్థిక, వ్యాపార, సాంస్కృతిక సంబంధాల పునాదిని పటిష్టం చేయడం ద్వారా.. భారత్–చైనా సంబంధాలు మరింత దృఢమయ్యే దిశగా ఇరుదేశాలు కృషి చేయాల్సి ఉంది!!

1949– రిపబ్లిక్ ఆఫ్ చైనా ఏర్పాటు
1954– పంచశీల సిద్ధాంతం
1959– టిబెట్‌ను ఆక్రమించిన చైనా
1962– భారత్–చైనా యుద్ధం
1987– అరుణాచల్‌ప్రదేశ్ ఏర్పాటు
1988– రాజీవ్ చైనా పర్యటన

1996– భారత్‌ను సందర్శించిన చైనా
అధ్యక్షుడు జియాంగ్ జెమిన్
2006– హూ జింటావో భారత పర్యటన
2006– ఇండో–చైనా ఫ్రెండ్‌షిప్ ఇయర్
2006– నాథులాపాస్ తిరిగి ప్రారంభం
2008– చైనాలో ప్రణబ్ ముఖర్జీ పర్యటన
2010– కల్లా 40 బిలియన్ డాలర్ల ద్వైపాక్షిక వాణిజ్య లక్ష్యం